
# తలవంపులు అనే సిగ్గు కథ!

## — పెయ్యేటి రామలక్ష్మి



తెలుగు కళాసమితి న్యూజెర్సీ కథ

ఆ అమ్మాయీ, ఆ అమ్మాయి తల్లిదండ్రుల పేర్లతో పని లేదు. భారతదేశంలో ఏ మూల చూసినా వాళ్ళు కనిపిస్తారు.

ఆ అమ్మాయికి యుక్త వయస్సొచ్చిందని వేరే చెప్పక్కర్లేదు. వయస్సుతోపాటు అమ్మాయిల్లో కొట్టొచ్చేటట్టు కనిపించే మార్పులు ఆ అమ్మాయిలోనూ చోటుచేసుకున్నాయి. ఆ అమ్మాయి యువతి అయింది. ఆ యువతిని చూస్తున్న యువకులు వెర్రెత్తిపోతున్నారు. సరే! యువతులకు సహజంగా కలిగే ఆశలూ... కోర్కెలూ ఆమెకూ వున్నాయి. ఒక పెద్ద ఉద్యోగి తన భర్త కావాలనీ, తననెంతో అపురూపంగా చూసుకోవాలనీ ఆమె మనస్సు తహతహలాడుతోంది.

ఇప్పుడా యువతిదో అరుదైన రాజ్యం. కలల రాజ్యం. ఆ కలల్లో ఆమె ఒక రాణీ. కాబోయే భర్త ఒక రాజు!! కాబోయే భర్తా... రాబోయే చిన్ని సంసారం ... ఆమె కనే కలల్లో ఎప్పుడూ వుంటున్నాయి.

ఇక ఆ అమ్మాయి తల్లి కూతుర్ని చూసి మురిసిపోవటల్లేదు. 'గుండెల మీది కుంపటిని ఎలా వదిలించుకోవాలా?' అని చూస్తోంది. ఈ కూతుర్నొదిలించుకుంటే... మరో కూతురు... ఆపై... మరో కూతురు. మొత్తం ముగ్గురు కూతుళ్లు!! మగపిల్లాడ్ని కనాలనే కలలు కల్లలు కాగా, చివరికి ముగ్గురమ్మాయిల్ని కని ఫుల్‌స్టాప్ పెట్టింది.

ఆ తల్లి...అనుకుంది! – 'లాభం లేదు. కూతురు పెళ్లి చేసెయ్యాలి. ఏ వయస్సుకు తగ్గ ముచ్చట ఆ వయస్సులో జరగాలి. తనకైతే... ఈ వయస్సుకే ఇద్దరాడపిల్లలు పుట్టేశారు. పూర్వం రోజులు కావు. మన దేశం కట్టుబాట్లు మన మెడలకి గుదిబండలయ్యాయి! ప్రేమ వివాహాలు చాలా అరుదుగా జరుగుతాయి. డేటింగ్ సిస్టమ్ గానీ, ఎవరికి వారు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే పద్ధతిగానీ మన దేశానికింకా రాలేదు. ఏ పనికి పూనుకున్నా ఆడవాళ్ళనే తప్పు పట్టి దేశ సంస్కృతీ... సంప్రదాయం మంటగలుపుతున్నారంటారు. కుల మతాల అడ్డుగోడలు మరింత పెరిగాయి. వాటిలో శాఖోపశాఖలు! వాటి మధ్యే వివాహాలు!! ఇంక ప్రేమ ఎక్కడ పుడుతుంది? డబ్బుతో ప్రేమల్ని కొలుస్తారు. విలువల్ని కాపాడుకుంటారు. పెళ్లి చేసుకున్నా మగాడు భార్యని కాదు ప్రేమించేది. ఆమె తెచ్చే కట్నాన్ని ప్రేమిస్తారు. నేడు ఆడపిల్లల పెళ్ళిళ్ళు సామాన్యులకు గగనకుసుమాలు!!

తన యుక్తవయసులో తననీ ఓ మగపురుగు ప్రేమించానంది. తను తెలివిగా 'పెళ్లి'... అంది! అంతే... కులమతాలూ, కట్న ప్రసక్తులూ లేవనెత్తి ఆ మగపురుగు జారుకుంది. ఇప్పటి కాలం పిల్లలకి ఆపాటి తెలివితేటలుంటాయా?... ఏమో?! పొరబాటున తన కూతురు కాలుజారితే?!...

... ఇంక ఆలోచించలేకపోయిందా తల్లి. భర్తని రోజూ కూతురికి సంబంధాలు వెతకమని వేధించింది.

పాపం! ఆ కూతుర్ని కన్న తండ్రో మధ్య తరగతి కుటుంబీకుడు. చిన్న వయసులోనే చదువుకు స్వస్తి చెప్పి ఇంటి బరువు బాధ్యతల్ని తలకెత్తుకుందుకు ఉద్యోగంలో చేరిపోయాడు. చాలాకాలం తండ్రికి చేదోడుగా వుండి, తోబుట్టువుల్ని చదివించి పెళ్ళిళ్ళు జరిపించాడు. తల్లిదండ్రుల బాధ్యతలూ అప్పులూ తీరేసరికి అతని కూతుళ్లు పెద్దవాళ్లై కూచున్నారు. అతని జీతం ఇంటి ఖర్చులకి సరిపోదు. ఏదో కూతుళ్లని చదివిస్తున్నాడు. 'బి.పి., సుగర్' వ్యాధులు అతనికి తాతలనాటి ఆస్తులుగా సంక్రమించాయి. అతనొక్కడే సంపాదనాపరుడా ఇంటికి. అతను కాస్తా గుటుక్కుమంటే ఆ ఇల్లు రోడ్డున పడుతుంది.

అందుకే ఆ తండ్రి కూతురు పెళ్ళిచెయ్యడానికి అప్పో సప్పో చెయ్యాలని నిర్ణయించుకున్నాడు. ఊరూరూ ముష్టివాడి. కన్నా హీనంగా, ఎక్కే గుమ్మం దిగే గుమ్మంగా కూతురి వరాన్వేషణలో తిరగడం సాగించాడు.

ఆ తండ్రి ఏడ్చేశాడు – 'హరి దేవుడోయ్?! నా కూతురుకి భర్తెక్కడున్నాడో చూపించరా! చూపించు!! అసలు ,ఈ లోకంలో నా కూతురుకు భర్తని పుట్టించావా? లేదా?! పుట్టిస్తే... వేగిరం నాకు చూపించెయ్యి. నేను తిరగలేను, అని.

చివరికి... ఆ... 'దే–వు – దు –' గాదు, ఆ తండ్రి మొరాలకించి కరుణించాడు.

పాతిక వేల కట్నంతో కూతుర్నింట్లోంచి బైటకి గెంటేశాడా తండ్రి!

పెళ్ళికొడుకు కాళ్లు పోలియో వ్యాధితో జబ్బుపడినా ప్రభుత్వంవారిచ్చిన చిన్న గుమాస్తాగిరీ వుంది అతనికి. అది చాలును తన కూతుర్ని పోషించడానికి అనుకున్నాడా తండ్రి. అంతా తన కూతురు అదృష్టమనీ, గత జన్మ సుకృతమనీ ఆ తండ్రి పొంగిపోయాడు.


పెళ్ళిలో కూతురైన ఆ అమ్మాయిని నోరు మెదపనివ్వలేదు. ఆడపిల్లలకి ఇష్టాయిష్టాలతో పనిలేదన్నారు. పెద్దలే కూతుళ్ల మంచి చెడ్డలు చూస్తారన్నాడు. కొండమీది కోతిని కొనలేని బీద తండ్రికి పుట్టినందుకు ఆశలన్నీ చంపుకోవాలన్నాడు. ఆ తండ్రి మాటలకే ఆ అమ్మాయి తల్లి కూడా వంత పాడింది.

ఆ విధంగా ఆ అమ్మాయి తల వంచుకుంది. వంచిన ఆ అమ్మాయి తల మీద 'జీలకర్రా–బెల్లం'తో ప్రమాణాలూ, మెళ్ళో మూడుముళ్లూ పడిపోయాయి.

'పెళ్ళి=రాజీ = స్వర్గంలో దేవతల నిర్ణయం!!' – అనుకుంటుందా అమ్మాయి. చెల్లెళ్ళ కోసం... తల్లిదండ్రుల బరువుబాధ్యతల్ని తీర్చడం కోసం ఆ అమ్మాయి తలవంచుకుని మెట్టినింట అడుగు పెట్టి గృహిణిగా మారి బరువుబాధ్యతల్ని తలకెత్తుకుంది.

గృహిణిగా తనకున్న ఆస్తిపాస్తులేమిటని ఆ అమ్మాయి ఆలోచించింది. పాతిక వేలు పెట్టి కొనుక్కున్న బాధ్యతల వలయంలో ఇరుక్కుపోయిన కాంతుడు... ఆమెకు కాంచనసముడు. పెళ్ళీడుకొచ్చిన ఆడబిడ్డా, ఇంకా చదువుకుంటున్న మరిదీ, వృద్ధాప్యమనే అనారోగ్యంతో బాధపడుతున్న అత్తమామలూ... వీరంతా ఆమె ధనరాశులు!!

ఆమె తన చదువుకునే రోజుల్ని గుర్తుచేసుకుంది. తన వెంటపడ్డ కుర్రకారుని గుర్తు చేసుకుంది. 'మోహన్', 'రాజు', 'జాన్సన్',




'రహీమ్' – ఇలా ... ఒకరేమిటి?... ఎందరో ఆమె వెనక బాడీగార్డుల్లా తిరిగారు. నోరు మెదపకుండా చొంగలు కార్చుకుంటూ వాళ్ళు ఆమెను బడి నుంచి ఇంటికీ, ఇంటి నుంచి బడికీ దిగబెట్టేవారు. వాళ్ళల్లో ఏ ఒక్కరికీ ఆమెను పెళ్ళాడే ధైర్యం లేదు. అందరూ తండ్రిచాటు బిడ్డలు! నిరుద్యోగులు! ఆర్థిక స్వాతంత్ర్యం లేని కుర్రకారు, అస్వతంత్రులూ – అసమర్థులూ కాక మరింకేమవుతారు?! పెళ్లికి ముందు తన అందానికి తానే మురిసిపోయి, తాను కన్న రంగుల కలల్ని తల్చుకుని ఆమె నవ్వుకుంది.

ఆ అమ్మాయికీ, ఆ అమ్మాయి తండ్రీ చెప్పాడు – తాము గడ్డి మొక్కల వంటివారమనీ, తమని పెను తుపాన్లు కూడా ఏమీ చేయలేవనీను. తలొంచుకు బతికే వాళ్ళ తలల మీంచి గాలులు వీచుకుంటూ పోతాయిగానీ, ఏమీ చెయ్యవనీ, అదే తలెత్తుకు నిలబడే పెద్ద పెద్ద వృక్షాల్ని పెను గాలులు పెకలించి పారేస్తాయనీ చెప్పాడు. సమాజ కట్టుబాట్లనీ, ఆచార వ్యవహారాల్నీ శాసించే మధ్య తరగతి కుటుంబంలో పుట్టడమే ఓ గర్వకారణమని చెప్పాడు. జీవితమంటేనే కష్టాలననుభవించడమనీ, న్యాయా న్యాయ విచక్షణా, ధర్మాధర్మ వివేచనా ఏ రోజూ మరువద్దని చెప్పాడు. దైవనామస్మరణతో ధైర్యం కూడగట్టుకుని కష్టాల్నెదుర్కోవాలని చెప్పాడు.

ఆ అమ్మాయి పెద్దదవుతున్నకొద్దీ ఆ అమ్మాయికీ, ఆ అమ్మాయి తల్లి మరింకెన్నో నీతుల్ని బోధించింది. ఆడపిల్లలకీ – మగపిల్లలకీ మధ్యనెంతో తేడా వుంటుందని చెప్పింది. ఆడపిల్లలకి స్వేచ్ఛగా నలుగురిలో నవ్వే హక్కు లేదంది. ఆడపిల్లలు తలొంచుకు బతకడం నేర్చుకోవాలని చెప్పింది. నలుగురిలో తలవంపులు తేవద్దనీ, పదుగురిలో సిగ్గుపడేలా చేయవద్దనీ పదేపదే కోరుకుంది!

ఆ అమ్మాయి అసలెప్పుడు తలెత్తింది కనక?!

పెళ్లికి ముందూ తలొంచుకుంది – పెళ్ళిలోనూ తలొంచుకుంది. ఇప్పుడు పెళ్ళయ్యాకా తలొంచుకు బతుకుతోంది. తలొంచుకు బతకడమే తన జన్మహక్కుగా బతుకుతోంది!

'సిగ్గు!!' – సింగారమంటారాద దానికి!? కాని... అమ్మ మాత్రం ఎప్పుడూ సిగ్గుపడేలా చెయ్యొద్దంది! 'పాపం! అమ్మకి సిగ్గనే సింగారం అక్కర్లేదనుకుంటాను' అనుకుని నవ్వుకుందా అమ్మాయి (మనసులో!)

ఆ అమ్మాయి తనకో ప్రాముఖ్యత లేనట్టూ, ఆత్మ లేనట్టూ, తల్లీ – తండ్రీ చెప్పే మాటలకు గంగిరెద్దులా తలూపుతూ తలొంచుకు బతికింది!

'తల వంచుకోవడానికీ – తల వంపులకీ అసలు తేడా ఏమిటి?!' ఆ అమ్మాయి బుర్ర బద్దలుకొట్టుకుని ఆలోచించింది.

ఆ అమ్మాయి మనసును చంపుకుంది. ఊహించుకున్న అందగాళ్లని గుండె గోడల్లో సమాధి చేసింది. కుల–మతాల అడ్డుగోడల్ని అతిక్రమించకుండాబతికింది.

గతంలో తల్లిదండ్రుల ఆత్మసంతృప్తి కోసం తలొంచుకుంటే, ఇప్పుడు భర్త, అత్తమామల ఆత్మతృప్తి కోసం తలొంచుకు బతుకుతోంది.

భర్తా – అత్తమామలూ – ఆడపడుచూ – అం–ద–రూ... ముక్తకంఠంతో... 'అ–బా–ర్ష–న్ చేయించుకో!' అనేశారు.

ఇప్పుడు కూడా ఆమె బుద్ధిగా తలొంచుకుంది.

'తలొంచుకు బతికే మరో జీవిని'... 'పెద్దలకి తల వంపులు తెచ్చే మరో జీవిని'... ఈ భూమ్మీదికి తెచ్చి... ఆ జీవినీ బాధపెట్టడం ఆమెకీ ససేమిరా ఇష్టంలేకపోయింది!!

'యత్రనార్యస్తు పూజయంతే!', 'మాతృదేవో భవ!!', 'స్త్రీ = ప్రకృతి = శక్తిస్వరూపిణి!!!'

మాతృగర్భంనించి బయటపడ్డ సమస్త జీవరాసీ... ఇలాటి సూక్తులని వల్లించే పవిత్ర భారతావని ఇది! పెదవి పైన మాత్రమే సూక్తుల్ని వల్లిస్తూ గుండెల్లోకి కత్తుల్నిదింపే ఘనులున్న దేశం!!

అంతా అయిపోయిందనుకుంటూ.... ఆ అమ్మాయి గర్భంలోంచి బైటపడ్డ ఆడపిండం... పుడమి తల్లి... మట్టిలో .. . ఈ 'అమ్మే' సుఖమనుకుంటూ కలిసిపోయింది! ●